# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వినూత్న మార్గాల ద్వారా ఉగ్రవాదులను అణిచివేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.**

2. **ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సందర్శిస్తారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో అన్నా క్యాంటీన్లను మూడు వారాల్లో పునరుద్దరిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

4. **తెలంగాణలోని సంక్షేమ శాఖల్లో 581 ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్ష షెడ్యూల్‌ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**

5. **బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

==========================

వినూత్న మార్గాల ద్వారా ఉగ్రవాదులను అణిచివేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలో భద్రత సంస్థలతో జమ్ము కాశ్మీర్‌లో భద్రత, అమర్నాథ్ యాత్ర ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవస్థీకృత ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటం నిర్ణయాత్మకమైన దశకు చేరుకుందని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో అంతకుముందు వ్యవస్థీకృత ఉగ్రవాదం భారీ స్థాయిలో ఉండగా, ఇప్పుడు కేవలం ఒక పరోక్ష యుద్ధానికి తగ్గిపోయిందని ఇటీవల జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరించాలని చెప్పారు. ఈనెల 29వ తేదీన ప్రారంభమై ఆగస్టు వరకు కొనసాగనున్న అమర్నాథ్ యాత్రకు తగిన భద్రతా ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉదయం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు. అక్కడ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి, ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం పోలవరం నుంచి ఉండవల్లికి తిరుగు పయనమవుతారని అధికారులు తెలిపారు.

మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్ట్ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్.నిమ్మల.రామానాయుడు నిన్న పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణపనులలో ప్రతీ అంశంలో వాటి నిర్మాణ ప్రగతిని ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తారని,ఆయా ప్రాంతాలలో ఇంజనీరింగ్ సిబ్బంది పనుల ప్రగతిని ముఖ్యమంత్రికి తెలియజేస్తారని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అన్నా క్యాంటీన్లను మూడు వారాల్లో పునరుద్దరిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. నిన్న మంత్రిగా అధికారికంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అన్నా క్యాంటీన్ల పునరుద్దరణపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా చేసిన ఐదు సంతకాల్లో అన్నా క్యాంటీన్ల పునరుద్దరణ దస్త్రం కూడా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల వ్యవస్థ ద్వారా అన్ని ప్రాంతాల్లో నిరుపేదలకు 5 రూపాయలకే ఉదయం టిఫిను, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందజేస్తామని తెలిపారు. అన్నా క్యాంటీన్లను పునరుద్దరించేందుకు అవసరమైన మరమత్తులు చేసేందుకు అంచనాలను రెండు మూడు రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

---------------------------

తెలంగాణలోని సంక్షేమ శాఖల్లో 581 ఉద్యోగాల భర్తీకి నిర్వహించాల్సిన పరీక్ష షెడ్యూల్‌ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళాశిశు సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాల్లో 562 అధికారులు, పిల్లల సంరక్షణ గృహాల్లో 19 మహిళా సూపరింటెండెంట్ పోస్టులకు 2022 డిసెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్ కి సంబంధించిన పరీక్షలను జూన్ 24 నుంచి 29వరకు నిర్వహించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ప్రతి రోజు రెండు విడతలుగా ఈ పరీక్షలు జరగనున్నాయి. కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే ఈ పరీక్షలు ప్రారంభం కావడానికి మూడు రోజుల ముందు నుంచి తమ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

---------------------------

బక్రీద్ పర్వదినాన్ని ముస్లీంలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్ తర్వాత బక్రీద్‌కు అత్యంత ప్రాముఖ్యతనిస్తారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగను పురస్కరించుకుని ముస్లీంలకు వారి ఆత్మీయులు శుభాకాంక్షలు అందచేస్తున్నారు.

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు సి.రాధాకృష్ణన్, ఎస్.అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు తమ శుభాకాంక్షలు తెలియచేశారు.

బక్రీద్ పండుగ త్యాగానికి నిస్వార్థ పూరిత ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని.. సమాజంలో అట్టడుగు వర్గాలకి, పేదలకు సహాయం చేయాలనే సందేశాన్ని ఇస్తుందని వారు తమ సందేశాల్లో పేర్కొన్నారు.

---------------------------

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈ రోజు హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ సీపీ విశ్వనాథ్ తెలిపారు. నిన్న ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ ప్రార్థనల సందర్భంగా నగరంలోని మాసబ్ ట్యాంకు సమీపంలోని మీర్ ఆలం దర్గా, హాకీ గ్రౌండ్, లంగర్ హౌస్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలను పోలీసులు అమలు చేస్తున్నారు. అయా ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లిస్తామని ఉదయం 8 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

---------------------------

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కాల్సిందేనని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖకు సంబంధించి సుప్రీంకోర్టు, ట్రైబ్యునళ్ల ముందు ఉన్న అంశాలపై సీనియర్ న్యాయవాదులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్రైబ్యునల్ తీర్పు వచ్చేవరకు తెలంగాణకు 50 శాతం వాటా కోసం ప్రయత్నించాలన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించేది లేదని పునరుద్ఘాటించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కృష్ణా జలాల సాధనలో ప్రజాప్రయోజనాలే కీలకమని.. దీనికి అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ నూతన కార్యనిర్వహణాధికారిగా ఐఏఎస్ అధికారి జె. శ్యామలరావు నిన్న బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ సంప్రదాయం ప్రకారం ముందుగా వరాహస్వామిని.. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత మాజీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి అధికారికంగా బాధ్యతలను శ్యామలరావుకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెడతామని, దర్శనానికి వచ్చిన వారికి వసతులు కల్పిస్తామని పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఉపముఖ్యమంత్రిగా జనసేన పార్టీ అధ్యక్షులు కె పవన్ కల్యాణ్ సహా 23 మంది మంత్రులతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో జనసేనకు మూడు, బిజెపికి ఒక మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పరిస్థితులపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్త విభాగం రూపొందించిన కూటమి ప్రభుత్వ కార్యాచరణ పై ప్రత్యేక చర్చ కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాల విస్తరణ ప్రస్తుతం మల్కనగిరి, విజయనగరం మీదుగా కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలియజేసింది. వచ్చే 4, 5 రోజుల్లో రుతుపవనాలు కోస్తాంధ్ర, ఒడిశా, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతాలకు వ్యాపించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్టు పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవచ్చని తెలిపింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఇక, తెలంగాణాలో రాగల మూడు రోజులపాటు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు, కొన్ని జిల్లాలలో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో ఉరుములు, మెరుపులు,

గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

======================